ప్రజాశక్తి
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

జనసేనలో చేరిన బాలినేని..

కంది రవిశంకర్ కూడా..

బాలినేనికి జనసేన కండువా కప్పుతున్న పవన్‌కళ్యాణ్

కంది రవిశంకర్‌ను పార్టీలో చేర్చుకుంటున్న పవన్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం జనసేన పార్టీలో చేరారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన అధ్యక్షులు, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ బాలినేనికి జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కంది రవిశంకర్ కూడా పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. ముందుగా వారిద్దరూ ఒంగోలు నుంచి వేర్వేరుగా వాహనాల ర్యాలీతో మంగళగిరి బయలుదేరి వెళ్లారు. బాలినేని వెంట ఒంగోలు నగరానికి చెందిన పలువురు వైసిపి కార్పొరేటర్లు కూడా ఉన్నారు. అయితే బాలినేనితో పాటు ఆయన అనుచరులుగా ఉన్న ఇద్దరు, ముగ్గురుకు మాత్రమే పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పారు. కార్పొరేటర్లు ఎవరిని ఆయన వేదిక మీదకు పిలవలేదు. పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరాలని వెళ్లిన కార్పొరేటర్లను వేదిక మీదకు పిలవకపోవడంతో వారంతా నిరుత్సాహంతో ఒంగోలుకు తిరిగి వచ్చారు.

గన్నవరంలో భారీ రోడ్డుప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

3లో

పంట నష్టపరిహారం..

రూ.57.98 కోట్లు విడుదల

- 44,652 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం
- 9,077 ఎకరాల్లో ఉద్యాన పంటలకు కూడా..
- తుది అంచనాల్లో తగ్గిన పంటనష్టం లెక్కలు
- ప్రాథమిక నివేదికలో 86 వేల ఎకరాలలో పంట నష్టం
- తుది నివేదికలో 53 వేల ఎకరాలకే పరిమితం

దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

భారీ వర్షాలు, వరదల కారణంగా జిల్లాలోని 14 మండలాల్లో 53,729 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు లెక్కలు తేల్చారు. 44,652 ఎకరాల్లో వరి, మినుము, ఇతర వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. 9,077 ఎకరాల్లో అరటి, పసుపు, కంద, ఇతర ఉద్యానపంటలకు నష్టం వాటిల్లింది. ఈ మేరకు వ్యవసాయ పంటలకు రూ.44.62 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.13.36 కోట్ల పంట నష్టపరిహారం విడుదలైంది. రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి రాయితీ కింద పంట నష్టపరిహారం జమవుతోంది.

గత నెలాఖరులో కురిసిన భారీవర్షాల కారణంగా కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో ఉన్న కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల లోని 24 లంక గ్రామాలు వరద ముంపుకు గురయ్యాయి. జిల్లాలోని అమృతలూరు, బాపట్ల, భట్టిప్రోలు, చెరుకుపల్లి, చీరాల, కారంచేడు, కర్లపాలెం, కొల్లూరు, నగరం, నిజాంపట్నం, పిట్టలవానిపాలెం, రేపల్లె, చుండూరు, వేమూరు మండలాల్లో వ్యవసాయ పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. వరి, మినుము, అరటి, పసుపు, కంద, గుమ్మడి, తమలపాకులు, కూరగాయల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కంద సాగుకు రూ.2.50 లక్షలు, తమలపాకుల తోటల సాగుకు రూ.లక్ష, పసుపు సాగుకు రూ.70 వేలు, అరటికి రూ.50 వేల వరకు రైతులకు పెట్టుబడి ఖర్చయింది. వరదల కారణంగా ఏ పంట కూడా రైతు చేతికి అందివచ్చే పరిస్థితి లేకపోయింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని పంటలు వరద నీటిలో ఉండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వరద తాకిడికి కొన్ని ప్రాంతాలలోని పంట పొలాలు ఇసుకతో మేటలు వేశాయి. ఎగువ ప్రాంతం నుంచి కొట్టుకొని వచ్చిన ముళ్ళకంపలు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలతో పంటపొలాలు సాగుకు పనికి రాకుండా పోయాయి. వీటిని తొలగించి పొలాలను సాగుకు సన్నద్ధం చేయడం రైతులకు తలకుమించిన భారంగా మారింది. రెండో పంట వేసేందుకు రైతులు తిరిగి దుక్కులు దున్ని మినుము, మొక్కజొన్న లాంటి పైర్లు సాగు చేయడం కోసం కసరత్తు చేపట్టారు.

తుది అంచనాల్లో తగ్గిన పంటనష్టం లెక్కలు

కేంద్రబృందం జిల్లాలో 2లో

నిర్మాణాలు లేక.. పూట గడవక..

- 'కూటమి' ప్రభుత్వంలోనూ తప్పని ఇసుక కష్టాలు
- పనులు లేక పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు

భవన నిర్మాణ కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత ఐదేళ్ల పాలనలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. కార్మికుల సంక్షేమానికి ఎలాంటి పథకాలు అమలు చేయకపోవగా గతంలో ఉన్న వాటిని కూడా కొనసాగించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో ఉపాధికి భరోసా కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ రంగ కార్మికులు అధికారికంగా గుర్తింపు పొందారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో 8,300 మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. వీరిలో ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఉన్నవారు 1,670 మంది, లేనివారు 6,630 మంది ఉన్నారు. నాడు వారందరూ సంక్షేమ పథకాలతో పాటు బీమా సదుపాయం పొందారు. ఇసుక ఉచితంగా లభించడంతో సంపన్న వర్గాల నుంచి నిరు పేదల వరకు వివిధ రకాల నిర్మాణాలు చేస్తుండేవారు. ఫలితంగా కార్మికులకు నిరంతరం పని దొరికేది. ఐదేళ్ల క్రితం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇసుకకు ధర నిర్ణయించారు. పలు రకాల ఆంక్షలు విధించడంతో నిర్మాణ పనులు నిలిచాయి. కార్మికులకు ఉపాధి దూరమైంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటుతున్నా ఇప్పటికీ ఇసుక సమస్య పరిష్కారం కాలేదు. గృహ నిర్మాణ పరికరాల ధరల ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో భవన నిర్మాణ యజమానులు తమ నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్నారు. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు.

నిధుల మళ్లింపు..

కేంద్రంలో పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కాలరాసింది. సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించి తీవ్ర అన్యాయం చేసింది. సంక్షేమ బోర్డును నిలుపుదల చేస్తూ 2021 సెప్టెంబర్‌లో మెమో 1214 తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న పరిహారాలను తక్షణమే 2లో

భద్రత కల్పించాలి..

దాసరి దాసు, తాపీ మేస్త్రీ, యర్రగొండపాలెం

నేను 20 ఏళ్లుగా భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నా.. నాకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సొంత పొలం లేదు. కూలి పనులు చేసుకుంటేనే గడిచేది. గతంలో మా కోసం అందించిన సంక్షేమ పథకాలన్నింటినీ ఈ కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేయాలి. నిర్మాణ పనులు చేసేవారి పరిస్థితి ప్రమాదకరంగా ఉంటుంది. ఏ పొరపాటు జరిగినా మా కుటుంబాలు వీధిన పడతాయి.

ప్రభుత్వ లాంఛనాలతో పార్వతమ్మకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మాగుంట పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు
- ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

2లో

వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మేరుగు

మేరుగు నాగార్జున (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగు నాగార్జున, బాపట్ల పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులుగా మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని తొలుత చీరాల ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్‌ను పార్టీ అధిష్టానం కోరింది. కానీ ప్రస్తుతం తాను జిల్లా బాధ్యతలు చేపట్టలేనని వెంకటేష్ చెప్పారు. జిల్లా అధ్యక్షుని ఎంపిక విషయమై పలు పేర్లు పరిశీలనలో తీసుకున్నప్పటికీ జిల్లాలోని మెజారిటీ నాయకుల అభిప్రాయం మేరకు వైసిపి జిల్లా అధ్యక్షుడిగా మేరుగు నాగార్జున పేరును ఖరారు చేశారు.

మాగుంట పార్వతమ్మకు నివాళి

మద్దిపాడు : మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ పార్థివ దేహాన్ని నెల్లూరులోని ఆమె నివాస గృహంలో టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు గురువారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నష్ట పరిహారం రూ.57.98 కోట్లు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

వరదముంపునకు గురయిన లంక గ్రామాల్లో పర్యటించింది. జిల్లాలో 1.81 లక్షల ఎకరాలు సాగవుతుండగా ఇందులో 86 వేల ఎకరాలలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు తొలుత నివేదికల్లో పేర్కొన్నారు. వరదల కారణంగా జిల్లాలో రూ.వెయ్యి కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు చెప్పారు. వరదల కారణంగా సుమారు 40 వేల మంది రైతులు తమ పంటలను కోల్పోయినట్లు ప్రాథమికంగా చెప్పారు. కానీ తుది నివేదిక నాటికి పంట నష్టం అంచనాలు తగ్గిపోయాయి. జిల్లాలో 35,565 మంది రైతులకు చెందిన 53 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు లెక్కలు తేల్చారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని రూ.57.98 కోట్లకు పరిమితం చేశారు. కౌలు రైతులను గుర్తించి వారికి కూడా పంటనష్టం అందేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవంలో అలా ఇవ్వడం సాధ్యపడలేదని తెలుస్తోంది. భూమిని కౌలుకు ఇచ్చిన యజమాని ఇందుకు అంగీకరించకపోతే కౌలు రైతుకు నష్టపరిహారం అందే పరిస్థితి లేదు.

దీంతో వ్యవసాయాధికారులు భూయజమానులతో చర్చించి కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూడాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం అంచనాల విషయమై రైతుల నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. వీటిని పరిష్కరించాల్సి ఉంది. జిల్లాలోని రైతులకు అపార నష్టం వాటిల్లిన నేపథ్యంలో విపత్తునకు గురైన ప్రాంతాలలో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉంది. ఇప్పటికే ఇచ్చిన రుణాలను రీ షెడ్యూల్ చేయాలని రైతులు కోరుతున్నారు. వరదల కారణంగా జిల్లాలో 7,970 గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకొని దెబ్బతిన్నాయి. 30 వేల మంది వరద బాధితులయ్యారు. 194 గృహాలు పాక్షికంగా దెబ్బతినగా, 214 కచ్చా గృహాలు, 245 పూరిళ్లు దెబ్బతిన్నాయి. 438 గేదెల షెడ్లు దెబ్బతినగా, 24 గేదెలు, ఒక దున్నపోతు, 34 గొర్రెలు, మేకలు, 351 కోళ్లు మృతిచెందాయి. వీరికి కూడా నష్టపరిహారం వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది.

నిర్మాణాలు లేక..పూట గడవక..

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించాలని కార్మికులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

పరిష్కారం కాని క్లెయిమ్‌లు..

2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత నూతన ఇసుక పాలసీని తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి లేకుండా చేశారు. జీవనోపాధిని దెబ్బ తీశారు. సంక్షేమ బోర్డు నిధులను దారి మళ్లించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించిన రూ.2450 కోట్లను తిరిగి సంక్షేమ బోర్డుకు సమ చేయాలని భవన నిర్మాణ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేసినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. సంక్షేమ బోర్డునే నిలుపుదల చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఏడేళ్లు ఇబ్బందులు పడ్డాం..

గుర్రం లక్ష్మీనారాయణ, తాపీ మేస్త్రీ, యర్రగొండపాలెం

నేను పదేళ్లగా భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తున్నాను. నాకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక మళ్లీ మాకు మంచి రోజులు వస్తాయని ఆశిస్తున్నాం. ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి గుర్తింపు కార్డు అందజేసి గతంలో అందించిన సంక్షేమ పథకాలు తిరిగి ఇవ్వాలి.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

డికెఎం రఫీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు దాటుతున్నా పెండింగ్ క్లెయిమ్‌ల చెల్లింపునకు అడ్డంకిగా ఉన్న 1214 మెమోను రద్దు చేయకుండా కాలయాపన చేస్తోంది. తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి.

ఫారెస్టు రేంజర్ రామిరెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -కనిగిరి : బదిలీపై కావలి వెళ్తున్న రేంజర్ కె.రామిరెడ్డికి అటవీశాఖ ఉద్యోగులు గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఘనంగా సన్మానించారు. అటవీ క్షేత్ర అధికారిగా రామిరెడ్డి రేంజిలోని ఉద్యోగులు,పర్యావరణ ప్రేమికులతో మమేకమై అటవీ సంపద స్మగ్లర్ల బారిన పడకుండా సిబ్బందికి మెలకువలు చెబుతూ విధి నిర్వహణలో రాణించారని అభినందించారు. కనిగిరి రేంజ్ లో చేసినటువంటి సేవలను సిబ్బంది కొనియాడారు.ఈ కార్యక్రమంలో కనిగిరి ఆర్ఓ తులసిరావు,పామూరు డిఆర్ఓ వెంకటసుబ్బయ్య, రెడ్యా నాయక్, గార్డ్ నరసింహ,,ఫారెస్టర్ వెంకటేశ్వర్లు,బషీర్, సిబ్బంది పాల్గొన్నారు.

22న టెట్ మోడల్ టెస్టు

ప్రజాశక్తి-దర్శి

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మరియు టీచర్స్ అకాడమీ కనిగిరి వారి సంయుక్త ఆధ్వర్యంలో డిఎస్‌సికి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు మోడల్ టెట్ పరీక్ష ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య, యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మీనిగా శ్రీను, షేక్.ఖాసిం గురువారం తెలిపారు. దర్శిలోని గీతాంజలి డిగ్రీ కాలేజ్‌లో ప్రముఖ విద్యావేత్త, ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణ్‌రావు పర్యవేక్షణలో మోడల్ టెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9705620277, 98555 00366, .90108 18910 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి - వెలిగండ

మండల పరిధిలోని గణేషుని కండ్రిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ షేక్ మహబూబ్ బాషా, ఇఒపిఆర్‌డి తాతపూడి సుకుమార్, ఐసిడిఎస్ సూపర్ వైజర్ కమల కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి పూలు, పండ్లు, గాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముక్కు మహలక్ష్మమ్మ, అంగనవాడీలు ముక్కు వెంకట శ్రీలక్ష్మి, మరియమ్మ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **SHEIK SUBHANI** (Old Name) S/O **SHEIK NAYUB RASUL** born on 01-11-1988 residing at (H.NO : 00, DV PALEM, PAMUR VILLAGE & POST, PRAKASAM DIST), have changed my name to **SHAIK SUBHANI** S/O **SHAIK NAYAB RASOOL** Here after my name is known as **SHAIK SUBHANI** (NEW NAME) S/O **SHAIK NAYAB RASOOL.**

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం:28/2022

ఇన్

ఓ.ఎస్. నెం: 137/2021

ఆళ్ల సుజాత ...డి.హెచ్.ఆర్/వాది

వర్సెస్

ఆళ్ల వెంకట రెడ్డి ...జె.డి.ఆర్./ప్రతివాది

టు,

ఆళ్ల వెంకట రెడ్డి తండ్రి నిమ్మారెడ్డి, గుండ్ల సముద్రం గ్రామం, మర్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా. అనువారికి,

పై నంబరు ఇ.పి.లో ఇ.పి షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎందు నిమిత్తం వేలం వేయరాదో కోరుచూ డి.హెచ్.ఆర్. నీమీద ఇ.పి.దాఖలు చేసినందున నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించినను జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం మరియు వేలం షరతులు నిర్ణయించు నిమిత్తం వాయిదా తే.03-10-2024వ అయి ఉన్నది. కావున పై తేదీన ఉదయం గం.10:30 ని.లకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీ పరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 03-10-2024

పొదిలి

తేదీ : 26-09-2024 ఇట్లు

ఎం.వి.రమణ కిషోర్, బి.కామ్.,ఎల్.ఎల్.బి.

అడ్వకేట్ మరియు నోటరీ,

పొదిలి, ప్రకాశం జిల్లా,

సెల్ :9948139224.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No.33/2023

ఉనాది వెంకటరామిరెడ్డి ... వాది

Vs

షేక్ కాలేషావలి @ బడే .... ప్రతివాది

ప్రకటన

టు:.. ప్రతివాది

షేక్ కాలేషావలి @ బడే S/o మస్తాన్ వలి @ నీళ్ళస్వామి R/o డోర్ నెంబరు:2-12, రమణాలవారిపాలెం, తాళ్ళూరు మండలము, ప్రకాశం జిల్లా,

పై దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు ఈ ప్రకటన ద్వారా కోర్టువారు నోటీసు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావా ను తేది. 23-10-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఎదుట స్వయముగాగాని వకీలు ద్వారాగాని హాజరయి పై దావా లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఎడల పై దావాను ను మీ పరోక్షమందు తీర్మానించ దరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్జాల అంజిరెడ్డి

మారం శ్రీనివాసరావు

తాడికొండ ప్రసాద్ బాబు

వాది తరుపు న్యాయవాదులు.

అద్దంకి

ప్రకటన

చీమలమర్రి గ్రామ కాపురస్తుడు, జడ శ్యామియేల్ గారి కుమారుడు అబ్రహం అనువారు గుంటూరు జిల్లా మరియు టౌన్ కాపురస్తురాలగు శ్రీమతి మువ్వా సుమిత్ర భర్త సురేష్ గారి తాలూకు దిగువ షెడ్యూలు ఆస్తిని కొనుగోలు చేయదలచినారు. సదరు ఆస్తి ఆమె మామయ్య గారగు మన్నం తిరుపతయ్య గారు 1990వ సం.లో వ్రాసి రిజిష్టరు చేసిన వీలునామా, 2009 వ సం.లో వారి మరణా నంతరం సంక్రమించిన ఆస్తి అయియున్నది. కావున షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎలాంటి అభ్యంతర ములు ఉన్నచో 10 రోజులలో ఈ క్రింది అడ్రసు దారుకు వ్రాతపూర్వకముగా ఆధారములతో తెలియ పరచవలసినదిగా ఇందుమూలముగా కోరడమైనది.

షెడ్యూలు

ప్రకాశం జిల్లా, సంతనూతలపాడు మండలం, పేర్నమిట్ట గ్రామ సర్వే నెం.114 దు దాఖలా య. 0-40 సెంట్ల భూమికి హద్దులు:

తూర్పు : మన్నం తిరుపతయ్య గారి నిల్వ భూమి

దక్షిణం : సర్వే నెం.113 దాఖలా పీర్లమాన్యం భూమి

పడమర : మన్నం తిరుపతయ్య గారి నిల్వ భూమి

ఉత్తరం : మన్నం తిరుపతయ్య గారి నిల్వ భూమి

ఒంగోలు

తేది : 26-9-2024 ఇట్లు

నల్లమల్లి లక్ష్మీనారాయణ

అడ్వకేట్ & నోటరీ గాంధీరోడ్డు,

ఒంగోలు

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No: 290/2023

మోరవనేని హనుమంతరావు ...... వాది

V/s

పారా వెంకట సురేష్ ... ప్రతివాది

To

పారా వెంకట సురేష్ S/o తిరుపతి స్వామి సర్వేరెడ్డిపాలెం (గ్రామం) ఒంగోలు (మండలం), ప్రకాశం(జిల్లా)

పై దావాలో వాది నీపై బాకీ రాబట్టుకొను నిమిత్తం దావా దాఖలు చేసి నీకు ఎన్ని మార్లు నోటీసులు పంపించినను తీసుకొనక కాలయాపన చేయుచున్నం దున ఈ పత్రిక ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా 06-11-2024 తేదికి వేసియున్నారు. ఆరోజు ఉదయం 10.30 ని.లకు మీరు స్వయముగా గాని, వకీల్ ద్వారా గాని హాజరు పడి మీఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనియెడల మీపరోక్షమందు దావా తీర్మానించ బడునని తెలియపరచడమైనది.

వాయిదా తేది :06-11-2024

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

అద్దంకి:

తేది : 26-09-2024

కరి రామకృష్ణారావు బి.ఏ.,ఎల్.ఎల్.బి

ఎం.రాజారామ్ బి.ఎస్సి. బి. ఎల్.,

వాది తరపు అడ్వకేట్.

శ్రీ కనిగిరి సివిలు జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

నోటీసు

అండర్ ఆర్డరు 5 రూలు 20 ఆఫ్ సివిలు ప్రొసీజరల్ కోడ్

O.S.No.220/2023

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, అరివేముల తరపున వారి బ్రాంచ్ మేనేజర్ ...వాది

మరియు

శ్రీమతి.జగడబీ లక్ష్మి మరియు ఒకరు ..ప్రతివాదులు

టు,

శ్రీ శీలం మాధవరెడ్డి, తండ్రి: చెన్నయ్య, ఇంటి నెంబర్: 1-1, శీలం వారి పల్లి గ్రామం, చంద్రశేఖరపురం మండలం, ప్రకాశం జిల్లా-523112. గారికి

పై నెంబరున దావాలో శ్రీ కోర్టు వారు మీకు దావా సమన్లు పత్రికాముఖంగా ఆదేశించియున్నారు. కావున మీరు తే.22-10-2024 దిన ఉదయం గం.10.30కు మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని మీ లాయర్ ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున నే దావాను తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియచేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 22-10-2024

యం.వి.విజయకుమార్,

వాది తరపు అడ్వకేట్,

కనిగిరి, ప్రకాశం జిల్లా.

సెల్ : 9490729398

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No.316/2022

రంపతోటి రవికుమార్ @ రవి ... వాది

Vs

తాతపూడి మత్తయ్య .....ప్రతివాది

ప్రకటన

టు: ప్రతివాది

తాతపూడి మత్తయ్య S/o దేవయ్య ముండ్లమూరు (గ్రామము), ముండ్లమూరు (మండలం), ప్రకాశం (జిల్లా.)

పై దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికి మీరు దురుద్దేశ్యపూర్వకముగా తీసుకొనక తిరిగి పంపుచున్నందువలన మీకు ఈ ప్రకటన ద్వారా కోర్టువారు జారీ చేసి మీ హాజరు నిమిత్తం ఈ దావాను తేది. 29-10-2024 నకు వాయిదా వేశారు. కావున మీరు ఆ తేదిన ఉదయం గం.10-30 ని.లకు పై కోర్టువారి ఎదుట స్వయము గాగాని వకీలు ద్వారాగాని హాజరయి పై దావా లో మీ ఆక్షేపణలను తెలియజేయవలెను. లేని ఎడల పై దావానును మీ పరోక్షమందు తీర్మానించదరని తెలియ జేయడమయినది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో //

వజ్జాల అంజిరెడ్డి

మారం శ్రీనివాసరావు

తాడికొండ ప్రసాద్ బాబు.

వాది తరుపు న్యాయవాదులు.

అద్దంకి

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 185/2024

బద్దేటి పెద్ద పుల్లయ్య ....వాది

వర్సస్

గుడిమె జయన్న ....ప్రతివాది

To

ప్రతివాది చిరునామా

గుడిమె జయన్న తండ్రి దానం, వయస్సు 61 సం.లు, రిటైర్డ్ సర్వే ఆఫ్ ఇండియా, డోర్ నెం. 10-70, పామూరుపల్లె గ్రామం, కొమరోలు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలోని వాది నీ నుండి దావా ప్రాంసరీ నోటు బాకీ మొత్తము వగైరాలు రాగోరి దావాను దాఖలు చేసియున్నాడు. సదరు దావాలో నీకేమైన ఆక్షేపణలు వున్న యెడల నీవు మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో తేదీ 01-11-2024న ఉదయం గం. 10:30 ని.లకు స్వయంగా గాని, లేదా నీ వకీలు గారి ద్వారా గాని హాజరై, నీఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో నీపరోక్షమందు దావాను విమర్శించి తీర్మానించబడునని తెలియజేయడ మైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

స్థలం: గిద్దలూరు

తేదీ: 26-09-2024 ఇట్లు

శ్రీ సి.హెచ్.పోలయ్య,

వాదిపరం అడ్వకేట్,

గిద్దలూరు.

CHANGE OF NAME

I, **KONDEPOGU SRIKALA** is legally wedded Spouse No.**2600549X**, Rank SEP, Name **PRASAD KONDEPOGU**, Residing at Village-PODALA KUNTA PALLI, Mandal- GIDDALUR District- PRAKASAM, Pin:523357, ANDHRA PRADESH State That, I have changed my name from **"K SRIKALA"** to **"KONDEPOGU SRIKALA"** due to variation of name in the Civil Documents such as my Aadhar Card and my Date of Birth is **20-07-1979** Vide affidavit dated 26-09-2024.

గన్నవరంలో భారీ రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

కోటపాడు, కొండమూరులో విషాదఛాయలు

వైద్యం కోసం వైజాగ్ వెళ్లి వస్తుండగా ఘటన

మృతి చెందిన మార్కు, మెరిమ్మ, ప్రేమమ్మ (ఫైల్ ఫొటోలు)

ప్రజాశక్తి - పంగులూరు

కృష్ణా జిల్లా గన్నవరం వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో పంగులూరు మండలానికి చెందిన ముగ్గురు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన కురుగంటి మార్కు (25), కొండమూరు గ్రామానికి చెందిన పాలిపోగు మెరిమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందగా మల్లెపోగు ప్రేమమ్మ (52) మార్గమధ్యంలో మృతి చెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన మల్లెపోగు ప్రేమమ్మ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమె భర్త ఆదాము, తన బంధువులైన కురుగంటి మార్కు, మేరిమ్మ, మురారితో కలిసి కారులో వైజాగ్‌లోని ప్రయివేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. బుధవారం ప్రేమమ్మకు వైద్యం చేయించి సాయంత్రం కోటపాడు బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి కృష్ణా జిల్లా గన్నవరం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న ఆదాముకు కాళ్లు చేతులు విరిగాయి. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న ఆదాము అల్లుడు కురుగంటి మార్కుకు బలమైన గాయాలవటంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ వెనక సీట్‌లో కూర్చున్న ఆదాము బావమరిది భార్య మేరిమ్మ కూడా అక్కడికక్కడే మరణించింది. మరోవైపు ఉన్న అన్న కుమారుడు మురారికి బలమైన గాయాలయ్యాయి. మధ్యలో కూర్చున్న పేషెంటు ప్రేమమ్మకు గాయాలు కావడంతో ఇంటికి తరలిస్తుండగా మార్గమధ్యంలో

లారీ ఢీకొన్న కారు

చిలకలూరిపేట వద్ద మృతి చెందింది. ఈమెను పోస్టుమార్టం నిమిత్తం తిరిగి గన్నవరం వైద్యశాలకు తరలించారు. మృతుడు కురుగంటి మార్కుకు నాలుగు సంవత్సరాల క్రితం కోటపాడు గ్రామానికి చెందిన సుకన్యతో వివాహమైంది. మార్కు బేల్దారు మేస్త్రి. గత పది రోజుల క్రితం మార్కు తన కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. భర్త మరణ వార్త విని సుకన్య కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. కొండమూరు గ్రామానికి చెందిన మృతురాలు పాలెపోగు మేరిమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. భర్త దీనయ్య వ్యవసాయ కూలిగా ఉన్నాడు. మేరిమ్మ మరణ వార్త విని, భర్త, పిల్లలు బోరున విలపిస్తున్నారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రేమను మొదట వైజాగ్ బస్సులో తీసుకెళ్లాలని ఆదాము అనుకున్నాడని, కాళ్లు వాచి నీరు కారుతుండటం వలన నడవలేని పరిస్థితిలో ఉందని కారులో తీసుకెళ్లారని వారు వాపోయారు. బస్సులో వెళితే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని బంధువులు బోరున విలపిస్తున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

చీదెళ్ల నాగేశ్వరరావు

తెలుగు విశ్వవిద్యాలయానికి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మృతి పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ చీదెళ్ల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేరు మార్పును ఉపసంహరించుకోవాలని లేకపోతే నిరసన తెలుపుతామన్నారు. భాషా ప్రయుక్త తెలుగు రాష్ట్రాల కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి, అసువులు బాసిన మహనీయుని త్యాగనికి స్ఫూర్తిగా నాటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు తెలుగు విశ్వవిద్యాలయంను నెలకొల్పి తరువాత కాలంలో ఆ విద్యాలయానికి శ్రీ పొట్టి శ్రీరాములు పేరు పెట్టారని తెలిపారు. పేరును తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే పొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధరించి ఆయన గౌరవాన్ని కాపాడాలని కోరారు.

మాజీ మంత్రి పుల్లారావుని కలిసిన సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మెన్‌గా నియమితులైన సందర్భంగా మాజీమంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దామచర్ల సత్యని శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి పుల్లారావు మాట్లాడుతూ పోర్టులు, హార్బర్లు, సంబంధిత శాఖ మీద పట్టు సాధించి పరిశ్రమలు వచ్చే విధంగా కృషి చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా కష్టపడి పనిచేయాలని దామచర్ల సత్యకు పుల్లారావు సూచించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు అంశాల మీద చర్చ జరిగింది.

దామచర్ల సత్యని సన్మానిస్తున్న మాజీ మంత్రి పుల్లారావు

డిఎస్‌పి నాగరాజును సత్కరిస్తున్న ఆటోనగర్ మెకానిక్‌లు

ఆటోనగర్‌లో దొంగతనాలు నియంత్రించాలి

డిఎస్‌పికి మెకానిక్ అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ సమీపంలోని ఆటోనగర్‌లో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కాపురం డిఎస్‌పి యు.నాగరుజుకు ఆటోనగర్‌లోని మెకానిక్ అసోసియేషన్ గురువారం విజ్ఞప్తి చేసింది. రాత్రివేళ పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. ఇటీవలే మార్కాపురం డిఎస్‌పిగా బాధ్యతలను చేపట్టిన నాగరాజును ఈ సందర్భంగా సత్కరించారు. డిఎస్‌పి నాగరాజు మాట్లాడుతూ దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ అధ్యక్షులు ఎంఆర్‌కె బాషా, ఉపాధ్యక్షులు సయ్యద్ వలి, కోశాధికారి నేరెళ్ల భద్రి, సభ్యులు మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

క్రోచెట్స్ స్క్వేర్‌లో గిన్నీస్ రికార్డు

ఘనత సాధించిన మార్కాపురం మహిళ స్వాప్నికా రాజ్ఞ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణానికి చెందిన కొండెపోగు స్వాప్నికా రాజ్ఞ క్రోచెట్స్ స్క్వేర్‌లో గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించింది. విశాఖపట్నం వెంకోజి పాలెంలోని సిఎంఆర్ ఫంక్షన్ హాలులో 22న 'మహిళా మనోవికాస్ క్రాఫ్ట్ అండ్ క్రియేషన్స్ సంస్థ' నిర్వహించిన ప్రదర్శనలో మార్కాపురం పట్టణానికి చెందిన కొండేపోగు స్వాప్నికా రాజ్ఞ పాల్గొన్నారు. ఆమె తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఈ పోటీల్లో 450 మంది మహిళలు 58,112 క్రోచెట్స్‌తో పాల్గొన్నారు. లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోచెట్స్ స్క్వేర్‌ను మార్కాపురం వాసి స్వాప్నికా రాజ్ఞ తయారు చేశారు. ఈ ప్రదర్శనలో ఆమె విజేతగా నిలిచింది. గిన్నీస్ వరల్డ్ రికార్డు సొంతం చేసుకుంది. మెమోంటోతో పాటు గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారందరూ తయారు చేసిన వస్తువులను ఉచితంగా అనాథలకు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. స్వాప్నికా రాజ్ఞ ఎంబిఎ, ఎం.ఫార్మశీ చదువుకున్నారు. వైద్యారోగ్య శాఖలో ఫార్మసీ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందారు. ఆమె ఓ వైపు వైద్య వృత్తిలో రాణిస్తూ ప్రవృత్తిగా 'క్రోచెట్స్ స్క్వేర్'ను ఎంచుకున్నారు. ప్రస్తుతం ఆమె త్రిపురాంతకం మండలంలోని దూపాడు పిహెచ్‌సిలో ఫార్మశిస్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రశంసాపత్రం అందుకుంటున్న స్వాప్నికా రాజ్ఞ

నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పాటు హర్షనీయం

ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తానయ్య

ప్రజాశక్తి-మార్కాపురం

ఇటీవల జరిగిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నూర్‌భాషా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని, కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు కేటాయిస్తామని ప్రకటించడం పట్ల నూర్‌భాషా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూదేకుల మస్తానయ్య హర్షం ప్రకటించారు. సిఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రి ఎం.డి.ఫరూక్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మస్తానయ్య మార్కాపురంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. నూర్‌భాషాలైన దూదేకుల కులస్తులకు ఈ కార్పొరేషన్ ద్వారా గౌరవం లభిస్తుందన్నారు. దూదేకులకు నామినేటెడ్ పదవులలో ప్రత్యేక స్థానం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం పట్టణ అధ్యక్షులు డి.పెద్ద హుస్సేన్, డివిజన్ అధ్యక్షులు దూదేకుల ఖాశిం, డివిజన్ కార్యదర్శి డి.గురవయ్య, మార్కాపురం పట్టణ సంఘం సభ్యులు డి.ఖాశిం, డి.బాబు, డి.వలి తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న మస్తానయ్య

ఎరువులు సీజ్ చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఎరువుల దుకాణంలో తనిఖీ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం గడికోట పంచాయతీ, దేవనగరం గ్రామంలో ఎరువుల దుకాణంలో వ్యవసాయ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను గుర్తించి 19.205 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్ చేశారు. తదుపరి చర్యల నిమిత్తం 6ఏ కేసు నమోదు చేసి జెసి కోర్టుకు అప్పచేపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్, ఏఒ వై.విజయ భాస్కర్ రెడ్డి, సాంకేతిక వ్యవసాయ అధికారి ఎస్కె మహబూబ్ బాష, గ్రామ రెవిన్యూ అధికారి సయ్యద్ చిన్న కాసిం పీరా పాల్గొన్నారు.

ఇంటికి వెళ్లి ఆధార్ అప్‌డేట్..

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడుకు చెందిన మద్దసాని రమేష్ కుమార్తె మద్దసాని యోగిత పూర్తిగా మంచానికి పరిమితమై ఉండగా సదరం సర్టిఫికెట్ కొరకు అధికారుల సూచనల మేరకు గురువారం ఇంటి వద్దకు వెళ్లి ఆధార్ ఆప్‌డేట్ చేశారు. మూలగుంటపాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ షేక్ అబ్దుల్ సత్తార్ ఆధ్వర్యంలో వారి నివాసానికి వెళ్లి ఆధార్ అప్‌డేట్ చేశారు. ఇప్పటివరకు సచివాలయాలకే వస్తున్న వారికి సేవలు అందిస్తున్న సిబ్బంది ఇంటి వద్ద మంచానికే పరిమితమైన వారికి ఇలాంటి సేవలు అందించడం హర్షణీయమని గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంటును అభినందించారు.

మాగుంట పార్వతమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు

మాగుంట పార్వతమ్మకు నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మాగుంట పార్వతమ్మ పార్థివ దేహానికి టిడిపి నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పిఎస్ఆర్) పూలమాలతో నివాళులర్పించారు. గురువారం నెల్లూరులోని మాగుంట పార్వతమ్మ నివాసంలో కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. మాగుంట పార్వతమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో రామకృష్ణ, రవి, శ్రీనివాసరావు ఉన్నారు.

గ్రామ సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం ముండ్లపాడు1 గ్రామ సచివాలయాన్ని గురువారం డివిల్డిఒ సాయికుమార్ తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి చెన్నారావు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, వీఆర్వోలు రమణ, శంకర్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలము లోని మండల పరిషత్ కార్యాలయం నందు మండల వ్యవసాయ అధికారి డి.విజయ కుమార్ అధ్యక్షతన సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ప్రతి పౌరుడు ప్రభుత్వ యంత్రాంగం నుంచి కావలసిన సమాచారమును పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుజాత, మండల స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సుధాకర్

ఉపాధ్యాయులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల కృష్ణా నదికి సంభవించిన వరదల కారణంగా దెబ్బతిన్న మండలంలోని పెదలంక గ్రామంలోని స్వాతి ఇంగ్లీష్ మీడియంహై స్కూల్ నందు ఉపాధ్యాయులుగా పని చేస్తున్న 26మంది వరదలకు ఆర్థికంగా నష్టపోయినపోయారు. ఒక్కొక్క టీచర్‌కు రూ.4వేల చొప్పున రూ.1.04 లక్షలను అప్పుస్మా జిల్లా కమిటీ సహకారంతో కర్నూలు జిల్లా డోన్ నందలి శ్రీ సుధా విద్యా సంస్థల అధినేత సుధాకర్ ఆర్థిక సహాయం అందజేశారు. అపుస్మ జిల్లా అధ్యక్షులు ఎంవి రావు, ఉపాధ్య క్షులు అంజిరెడ్డి, సెక్రటరీ ఎస్ రవిశంకర్, ట్రెజరర్ నాగేశ్వ రరావు, ఈసీ మెంబర్ హయగ్రీవ చారి, ఇతర కరస్పాండెంట్ మిత్రులు పాల్గొన్నట్లు సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ వి నాగేశ్వరరావు తెలిపారు.

గురజాడ, గుర్రం పద్యాలు ఆలపిస్తున్న విద్యార్థులు

పద్యాల ఆలాపన

ప్రజాశక్తి - అద్దంకి

ప్రముఖ తెలుగు కవులు గురజాడ అప్పారావు, గుర్రం జాషువ జయంతి సందర్భంగా ఈనెల 21నుండి 28వరకు పాఠశాలల్లో భాషా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాల్లో గురజాడ అప్పారావు, గుర్రం జాషువా పద్యాలతో పాటు మన అద్దంకికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం చెన్నుపాటి రామాంజనేయులు రచించిన శతక పద్యాలు విద్యార్థులచే ఆలపించారు, కార్యక్రమంలో హెచ్‌ఎం కోట అంజమ్మ, ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్వతమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పార్వతమ్మ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మాజీ పార్లమెంటు సభ్యురాలు, మాగుంట సుబ్బరామిరెడ్డి సతీమణి పార్వతమ్మ విద్యా రంగానికి చేసిన సేవలు మరువలేనివని నేతాజీ విద్యా సంస్థల డైరెక్టర్ సయ్యద్ కరిముల్లా కొనియాడారు. మండలంలోని వలపర్లలోని మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో పార్వతమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే లక్ష్యంతో మాగుంట చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 1992లో ప్రకాశం జిల్లాలో 16 జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత వారికే చెందుతుందని అన్నారు. మాగుంట కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాలకు చేరుకోవడంలో కృషి చేసిన పార్వతమ్మ సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో వలపర్ల మాజీ సర్పంచ్ కొల్లిపర పూర్ణచంద్రరావు, కాలేజీ అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, సిహెచ్ శ్రీనివాసరావు, సూరిబాబు పాల్గొన్నారు.

చిట్యాల ఐలమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

చిట్యాల ఐలమ్మ 129వ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక ఆద్వర్యంలో ఆమె జయంతిని పట్టణ ప్రధాన కూడలిలో గురువారం నిర్వహించారు, ఐలమ్మ చిత్రపటానికి మాజీ సర్పంచ్ చెన్నుపల్లి వెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళి అర్పించారు. పొరాడితే పొయేదేముంది బానిస సంకెళ్ళుతప్ప అనే సిద్ధాంతంతో అనేక పోరాటాలు ఆమె చేశారని గుర్తు చేసుకున్నారు. ఈనాటి తెలంగాణ ప్రభుత్వం హైదరాబాదులో ఒక యూనివర్సిటీకి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంగా పేరు పెట్టడం ఎంతో గర్వించదగిన విషయమని అన్నారు. ఐక్య వేదిక అద్యక్షుడు జ్యోతి రమేష్ మాట్లాడుతూ రజాకర్లకు ఎదురొడ్డి అనేక పోరాటాలు చేసి ఎందరికో మార్గదర్శకురాలిగా ఐలమ్మ నిలచిందని అన్నారు. విద్వాన్ జ్యోతి చంద్రమౌళి మాట్లాడుతూ తెలంగాణ పోరాట యోధురాలు, ఉద్యమనేత ఐలమ్మ తన పంట పొలంలో ఆనాటి పటేల్‌ను ఎదిరించి పోరాడి తన పంటను రక్షించటంమే కాక 10వేల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయించిన వీర వనితని అన్నారు. ప్రముఖ కవి చెన్నుపాటి రామాంజనేయులు మాట్లాడుతు కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ ఈ నాటికి అణగారిన వర్గాలకు ఒక ధీరవనితగా, ఒక యోధురాలుగా కొలవబడుతున్నదని అన్నారు. పోరాటంలో పెత్తం దారులను ఒంటి చేతితో మట్టి కరిపించిన వీర వనిత అన్నారు. సాహితీ విశ్లేషకులు అన్నమనేని వెంకటరావు మాట్లాడుతూ ఒక మహిళ కాదు ఒక శక్తని అన్నారు. అప్పట్లో 4500 మందికిపైగా పోరాటంలో చనిపొయిన పట్టు విడువక, భయపడక, ఒక సివంగిలా పెత్తందారులపై ఎదురొడ్డి నిలిచారని అన్నారు. ఆమె పేదలకోసం తన కుటుంబాన్ని వదలి పోరాటం చేసి ఎందరికో అన్నం పెట్టిన గొప్ప ధీర వనితని ఐక్యవేదిక కోశాదికారి, దాస భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో మన్నం త్రిమూర్తులు, కృష్ణ, పవన్ పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మండలంలోని వెల్లటూరు గ్రామం రజకుల రామాలయం నందు రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పోతార్లంక రాజేష్ ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ 129వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారిణిగా, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత, సామాజిక, ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ, ధైర్యశాలి ఐలమ్మని రాజేష్ కొనియాడారు. కార్యక్రమంలో ఐనంపూడి నాగేశ్వరరావు, చందోలు రవికుమార్, సత్యనారాయణ, మున్నంగి శివమణి, పోతారులంక గోపికృష్ణ పాల్గొన్నారు.

ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం

సెయింట్ ఆన్స్‌లో ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి - వేటపాలెం

సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఎంబెడెడ్ సిస్టమ్స్ మూడు రోజుల వర్క్ షాప్ గురువారం విజయవంతంగా ముగిసినట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణరావు తెలిపారు. బిటెక్ ఇసిఇ విభాగంలో మూడవ సంవత్సరం విద్యార్థులకు ఎపైఆర్‌స్వేకేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్షాపును ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి) ఎంబెడ్డ్ సిస్టమ్స్‌పై నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కె జగదీశ్ బాబు తెలిపారు. విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై అవగాహన కల్పించి వాటిపై ప్రయోగాలను నిర్వహించారని ఇసిఇ విభాగాధిపతి కన్వీనర్ డి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు ఆర్డినో బోర్డ్ ఇంటర్ పేస్ సాఫ్ట్వేర్‌పై అవగాహన కల్పించి దానిపై ప్రయోగాలు నిర్వహించినట్లు తెలిపారు. వర్క్ షాపులో అత్యుత్తమ ఫలితాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎపై ఆర్స్వేకేర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన గోపి కృష్ణ రత్నాకరన్ తన టీం సభ్యులు పాల్గొని విద్యార్థులకు ఆర్డినో సాఫ్ట్వేర్ మెళుకువలను నేర్పించారు. ఈ వర్క్ షాపునకు ఆర్‌విఎస్ హరీష్ కో కన్వీనర్ వ్యవహరించారు.

వర్క్‌షాపుకు హాజరైన విద్యార్థులు

చీరాల పట్టణాభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - చీరాల

పట్టణ అభివృద్ధికి అందరి సహకారంతో తన వంతు కృషి చేస్తానని శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య అన్నారు. సిఎం చంద్రబాబు 100 రోజుల పరిపాలన పూర్తయిన సందర్భంగా పట్టణంలోని 12వ వార్డులో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అక్టోబర్ 5 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు పెన్షన్ ఇప్పిస్తామని అన్నారు. అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ.10వేలు టిడిపి యువ నాయకులు గ్రంధీ అదిత్య ఎంఎల్ఎకు అందజేశారు. గత ఐదేళ్ళపాలనలో మాజీ సీఎం జగన్ ప్రభుత్వ అస్తులను తాకట్టి పెట్టి బటన్లు నొక్కి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నేట్టివేశాడని ఆరోపించారు. ప్రస్తుతం సంక్షోభంలో కూడా సిఎం చంద్రబాబు ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపదంలో ముందుకు నడిపిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, కౌన్సిలర్లు, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య

ఎంపిడిఒగా శ్రీనివాసరావు నియామకం

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇప్పటి వరకు ఎంపిడిఒగా విధులు నిర్వహించిన ఆర్ రాజ్యలక్ష్మి బదిలీపై కోరిశపాడు వెళ్ళనున్నారు. ఆమె స్థానంలో గట్టా శ్రీనివాసరావు నూతన ఎంపిడిఒగా రానున్నారు. కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, టైపిస్టు భాస్కరరావు బదిలీపై వెళ్ళనున్నారు. తహశీల్దారు కార్యాలయం, పంచాయతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది, విఆర్‌ఒలకు బదిలీల ప్రక్రియ ఉన్నట్లు తెలిసింది. ఈ బదిలీల ప్రక్రియ అక్టోబర్ 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ తర్వాత ఉంటాయని భావిస్తున్నారు.

రూ.5లక్షలు అందజేసిన మదర్ థెరీసా హాస్పిటల్ చైర్మన్

సిఎం సహాయ నిధికి రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - రేపల్లె

వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.5లక్షలు పట్టణానికి చెందిన మదర్ థెరిస్సా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ నల్లపనేని నాగ రాజేంద్ర, డాక్టర్ సునీత దంపతులు గురువారం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విరాళాన్ని మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో సెక్రటేరియట్‌లో అందచేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సునీత దంపతులను అభినందించారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం అందిస్తున్న నగదును నియోజకవర్గంలోని ఐదుగురు లబ్ధిదారులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ గురువారం అందజేశారు. చిలకలూరిపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని కొటికలపూడికి చెందిన అనపర్తి మరిడమ్ అనే బాలుడు అనారోగ్యంతో విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్‌లో చేరారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వైద్యులు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని సూచించారు. సరైన నిధుల లేమితో ఇబ్బంది పడుతుండగా స్థానిక నాయకులు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి సీఎం సహాయ నిధికి లేఖ రాసి రూ.15లక్షలు మంజూరు చేయించారు. ఆ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో రావిపాటి వీరాంజనేయులు, పెంట్యాల సుబ్బారావు, రావూరి అరవింద్, మార్లపాటి వీరాంజనేయులు ఉన్నారు.

శిక్షణ ముగింపులో స్కిల్ డెవలప్మెంట్ ఆఫీస్ తమ్మాజిరావు

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక భారతి డిగ్రీ కాలేజీలో గత నెల రోజులుగా ఎపి ఎస్ఎస్‌డిసి ఉన్నతి ఆధ్వర్యంలో జరిగిన యునెక్ట్స్ శిక్షణ గురువారం ముగిసింది. ఆంగ్లభాషపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువల గురించి వివరించారు. కళాశాల డైరెక్టర్ ఎం బ్రహ్మయ్య, ప్రిన్సిపాల్ యు జయ శంకర్ ప్రసాద్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ కె రామకృష్ణారెడ్డి ఇంటర్వ్యూలు, డిబేట్, పబ్లిక్ స్పీకింగ్ ఎలా ఎదుర్కోవాలో విద్యార్థులకు వివరించారు. శిక్షణ ద్వారా విద్యార్థులు ఎంతో విలువైన సమాచారం నేర్చుకున్నామని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్ అండ్ వాల్యూస్ ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ తమ్మాజీరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాన్ టెక్నికల్ ఆఫీసర్ నాగ వెంకట్, కె సంజీవ్ కుమార్, టి రమేష్ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గొట్టిపాటి రవికుమార్

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం నడుస్తోంది..

మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం నడుస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని రామతీర్థంలో రూ..3.5 కోట్లతో ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చీమకుర్తి ఏరియాలోని గ్రానైట్ పాలిషింగ్ యూనిట్ల యజమానులు కలిసి పలు సమస్యలు విన్నవించుకున్నారు. లోఓల్టేజి సమస్య పరిష్కరించాలని, చీమకుర్తి ఏరియాను ఒంగోలు డివిజన్ విద్యుత్ పరిధిలోకి తీసుకురావాలని, విద్యుత్ సబ్సిడీ రూ.2 ఇవ్వాలని కోరారు. విద్యుత్ సబ్సిడీ సమస్య ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని మంత్రి చెప్పారు. అనంతరం ఆర్ఎల్‌పురంలో ఏర్పాటు చేసిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఎమ్మెల్యే బిఎన్.విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్‌పురం గ్రామ ప్రజలు మంత్రి గొట్టిపాటి దృష్టికి పలు విద్యుత్ సమస్యలు తీసుకెళ్లారు. వాటిని పరిశీలించి,వెంటనే ప్రతిపాదనలు పంపాలని మంత్రి గొట్టిపాటి అధికారులకు ఆదేశించారు. ఇంటింటికీ తిరిగి 'మంచి ప్రభుత్వం' కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, మండల అధ్యక్షులు జి.రాఘవరావు, యువ నాయకులు పమిడి రవితేజ, గొల్లపూడి సుబ్బారావు, కందిమళ్ల గంగాధరరావు, వేల్పుల శ్రీను, ఆర్డీఓ జివి.సుబ్బారెడ్డి, మండల స్పెషలాఫీసర్ ఝాన్సీరాణి, ఎంఆర్ఓ బ్రహ్మయ్య, ఎంపిడిఓ రాఘవేంద్ర, విద్యుత్ ఏడి జివి కృష్ణారెడ్డి, దర్శి ఈఈ అబ్దుల్‌కరీం, ఎస్ఈ కెవివిసత్యనారాయణ, ఏఈ వి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

2న మున్సిపల్ ఉపాధ్యాయుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం దశలవారీ పోరాటానికి యుటిఎఫ్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు అక్టోబర్ రెండున నిర్వహించనున్న సత్యాగ్రహ దీక్షలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని యుటిఎఫ్ ఒంగోలు నగర శాఖ విజ్ఞప్తి చేసింది. సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 17న డిఇఒ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించాలని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 24న విద్యాశాఖ డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా చేపట్టనున్నట్లు యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు చావలి వెంకటరమణయ్య, జిల్లా కార్యదర్శి ఎం బాలరాజు, నగర ప్రధాన కార్యదర్శి సిహెచ్.లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులు అనేక సంవత్సరాలుగా ప్రమోషన్లు, బదిలీలకు నోచుకోక ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రాష్ట్రశాఖ ఇచ్చిన పిలుపులో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా బాలాంజనేయులు

ప్రజాశక్తి-ఒంగోలు

ప్రకాశం జిల్లా రిజిస్ట్రార్‌గా ఎ.బాలాంజనేయులు నియమితులయ్యారు. గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో చిలకలూరిపేటలో పనిచేసిన కె.శ్రీనివాసరావు ఒంగోలు-1 జాయింట్ సబ్‌రిజిస్ట్రర్‌గా, గతంలో కావలిలో పనిచేసిన కె.రాంబాబు ఒంగోలు-2 జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గతంలో శింగరాయకొండలో పనిచేసిన సిహెచ్.శ్రీనివాసరావు సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్‌గా, గతంలో గూడూరులో పనిచేసిన మురళీబాబు చీమకుర్తి సబ్‌రిజిస్ట్రార్‌గా, గుంటూరు జిల్లాలో పనిచేసిన నీరజ పొదిలి సబ్‌రిజిస్ట్రార్‌గా, గతంలో కందుకూరులో పనిచేసిన సుల్తాన్‌బాషా యర్రగొండపాలెం సబ్ రిజిస్ట్రార్‌గా, గతంలో బాపట్లలో పనిచేసిన శ్రీనివాసరావు దర్శి సబ్ రిజిస్ట్రార్‌గా, గతంలో కనిగిరిలో పనిచేసిన గిరిజ మార్కాపురం-1 జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా, గతంలో ఒంగోలు ఆడిట్‌లో పనిచేసిన విజయలక్ష్మి మార్కాపురం-2 జాయింట్ సబ్‌రిజిస్ట్రార్‌గా, గతంలో ఇంకొల్లులో పనిచేసిన హేమలత శింగరాయకొండ సబ్‌రిజిస్ట్రార్‌గా, గతంలో నెల్లూరు జిల్లాలో పనిచేసిన చంద్రశేఖరరెడ్డి అమ్మనబ్రోలు సబ్‌రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. వీరందరూ త్వరలో ఆయా కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

మైనార్టీలకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు

అధికారులకు డిఆర్ఓ ఆర్.శ్రీలత ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు మైనార్టీ ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఆర్.శ్రీలత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ఒంగోలు డిఆర్ఓ ఛాంబర్‌లో గురువారం మైనారిటీల సంక్షేమ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి 15 పాయింట్ ప్రోగ్రాంపై ఆమె సమీక్ష నిర్వహించారు. డిఆర్ఓ శాఖల వారీగా సంబంధిత అంశాలపై సమీక్ష చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలలో మైనార్టీ ప్రజలు కనీసం 15 శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్జీవోలు షేక్ షాకీర్. నతానియేల్ రాజేంద్ర మాట్లాడుతూ మైనార్టీ ప్రజలకు అన్ని పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవిన్యూ అధికారిని కోరారు. సమీక్షా సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి డి. సుభద్ర, ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, పలువురు జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు జిల్లా కమిటీ లోని వివిధ జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిఆర్ఓ ఆర్.శ్రీలత

పార్కును వినియోగంలోకి తేవాలని నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

స్థానిక 48వ డివిజన్ దిబ్బలరోడ్డులోని పార్కు పనులు పూర్తి చేసి వెంటనే వినియోగంలోకి తీసుకు రావాలని సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్ డిమాండ్ చేశారు. దిబ్బలరోడ్డులోని పార్కును పార్టీ స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. పార్కును వెంటనే వినియోగంలోకి తీసుకు రావాలని పార్కు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్కు పనులు మొదలుపెట్టి 8 నెలలు కావస్తున్నా ఇంకా పనులు పూర్తి కాలేదని తెలిపారు. పార్కు నిర్మాణం పూర్తి అయితే మూడు డివిజన్‌ల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. పార్కు లోపల వాకింక్ ట్రాక్, జిమ్ నెలకొల్పుతున్నందున ప్రజలకు అన్ని విధాలా ఉపయోగపడుతోందన్నారు. పార్కులో వాకింక్ ట్రాక్, జిమ్ పనులు పూర్తి కానందున 48వ డివిజన్, పరిసర ప్రాంత ప్రజలు వాకింగ్‌కు రంగారాయుడు చెరువుకు వెళ్లాల్సి వస్తుందన్నారు. పార్కులో కాంట్రాక్టర్ జిమ్ పరికరాలు అమర్చలేదని తెలిపారు. అసంపూర్తిగా వదిలేసిన పనులు పూర్తి చేయకపోతే పార్కు నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులు పట్టించుకోని పార్కు పనులు పూర్తి చేయించి, వినియోగంలోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 48వ డివిజన్ ప్రాంత సిపిఎం శాఖా కార్యదర్శులు జి బీష్మాచారి, జి ఆదిలక్ష్మి, స్థానిక నాయకులు డి ఏడుకొండలు, పాపని సుబ్బారావు, కె రాజేశ్వరి, ఎన్ ఇంద్రజ్యోతి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

100 రోజుల్లో ప్రజల మన్ననలు పొందాం..

ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిందని స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ తెలిపారు. స్థానిక 30వ డివిజన్‌లో గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జనార్ధన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మూడు బొమ్మల సెంటర్‌లో నూతనంగా నిర్మించిన ఫంక్షన్‌హాల్‌ను ఆయన ప్రారంభించారు. తరువాత డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తెచ్చామని, మెగా డిఎస్సీ విడుదల చేశామని, పెన్షన్లు పెంచామని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదిన జీతాలు ఇస్తున్నామని, విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచామని తెలిపారు. ఒంగోలు నగరంలో త్వరలో కొత్త తాగునీటి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి రోజూ తాగునీరు ఇస్తామని చెప్పారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. నగరంలోని స్లమ్ ఏరియాల్లో ప్రతి మూడు నెలలకోసారి మెడికల్ క్యాంపులు నిర్వహించి వారికి అవసరమైన మందులు ఉచితంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కె వెంకటేశ్వరరావు, స్థానిక టిడిపి నాయకులు నత్తల కనకారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

మురుగునీటి శుద్ధిపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో రాంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు మురుగునీటి శుద్ధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులను ఒంగోలు నగరంలో కొప్పోలు వద్ద ఉన్న 15 ఎంఎల్‌డి (మిలియన్ ఆఫ్ లీటర్స్ ఫర్ డే) సామర్థ్యం ఉన్న మురుగునీటి శుద్ధి కేంద్రానికి తీసుకువెళ్లి శుద్ధి చేసే పద్ధతులను వివరించారు. విద్యార్థులకు జ్యూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాఘవరెడ్డి, డిఇఇ గణపతి, రాంనగర్ మున్సిపల్ హైస్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నేడు కావూరి సుబ్బారావు సంతాప సభ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

కావూరి సుబ్బారావు (ఫైల్)

సీనియర్ జర్నలిస్టు కావూరి సుబ్బారావు నాలుగో వర్ధంతి సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ఒంగోలు, దిబ్బలరోడ్డు చివర కావూరి ఇంటి వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటలకు సంతాప సభ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున జర్న లిస్టులు, ప్రజాసంఘాల నాయకులు, కవులు, కళాకారులు, ప్రజలు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం శివమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంతపేటలోని శివమ్ శరణాలయంలో అన్నదానం చేయనున్నట్లు కమిటీ అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు తెలిపారు.

ఎన్టీఆర్ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని పలు ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు గురువారం పర్యటించారు. ఎబిఎం కళాశాల గ్రౌండ్, కొత్తపట్నం రోడ్డు, ఎన్‌టిఆర్ కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఎబిఎం కళాశాల గ్రౌండ్‌ను పరిశీలించిన కమిషనర్ అక్కడ వాకర్స్ ట్రాక్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్తపట్నం రోడ్డులో రోడ్డు మీద నిలిచిన నీరు కాల్వల్లోకి వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తరువాత ఎన్‌టిఆర్ కాలనీలో పర్యటించారు. ఎన్‌టిఆర్ కాలనీ మొదటి లైన్‌లో ఆక్రమణలకు గురైన డొంక రోడ్డును పరిశీలించారు. వెంటనే ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో కాల్వలు శుభ్రంగా లేకపోవడాన్ని గమనించిన కమిషనర్ శానిటేషన్ ఇన్స్‌పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయాలని స్థానికులు కమిషనర్‌ను కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకుంటానని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కమిషనర్ వెంట కార్పొరేషన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నలగాటి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాజధానిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో తెలుగు యువత మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి నలగాటి చిన్న మల్లికార్జున నాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీసీలకు టిడిపిలో పెద్ద పీట వేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సారధ్యంలో అభివృద్ధి చేసేందుకు అవసరమైనన్ని నిధులు కేటాయించాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలో మార్కాపురం రోడ్డులోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా చిరు వ్యాపారం చేసుకుంటున్న సూరె కిషోర్ అనే వ్యక్తికి రెండు కాళ్లకు ఇన్ఫెక్షన్ వచ్చి పుండ్లు ఏర్పడ్డాయి. వైద్యులు ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఆపరేషన్ నిమిత్తం రూ. 1,50,000 ఖర్చు అవుతుందని తెలిపారు. విషయం తెలుసుకున్న యర్రగొండపాలెంనకు చెవదిన చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తమ వంతు సహాయంగా గురువారం రూ.ఆరు వేల ఆర్థిక సాయం చేశారు.

విద్యార్థులకు డెబిట్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

వ్యాసరచనలో బూదవాడ విద్యార్థికి ప్రథమ స్థానం

ప్రజాశక్తి - పంగులూరు

'స్వర్ణాంధ్ర 2047' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఎంఇఒ జి వీరాంజనేయులు తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చెందాలంటే ఎలాంటి విధానాలు పాటించాలి, ఎలాంటి మార్పులు చేయాలనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ, చర్చ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పోటీల్లో బూదవాడ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ సమీరా వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. డిబేట్ పోటీలో చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్ గాయత్రి, ఎస్ దీపికరాణి ప్రథమ స్థానాన్ని సాధించారని, వకృత్వ పోటీలో చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్ గాయత్రి ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 28న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ప్రతి మండలం నుండి వ్యాసరచన, వకృత్వ పోటీలకు ఒక్కొక్కరు, డిబేట్ పోటీకి ఇద్దరు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీకి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో పంగులూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కొప్పోలు రమాదేవి పాల్గొన్నారు.

సుబ్బారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బహుజన ఉద్యమాల్లో 'పెనుమాల'

ప్రజాశక్తి - రేపల్లె

అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడిగా, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా బహుజన కార్మిక వర్గాల హక్కుల కోసం పోరాటాలు చేస్తూ ప్రజా ఉద్యమాలకు ఊపిరి పోసిన పెనుమాల సుబ్బారావు సేవలు చిరస్మరణీయమని న్యాయవాది రమేష్‌రాంజీ పేర్కొన్నారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డు 13వ వార్డులో పెనుమాల సుబ్బారావు ప్రథమ వర్ధంతి నిర్వహించారు. సుబ్బారావు చిత్రపటా నికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పోతారులంక శివ వెంకటేశ్వరరావు, కర్రా బాబురావు, పెనుమాల క్రాంతి కిరణ్, దాసరి ప్రకాష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన ఆల్టస్ విద్యార్థులు

జిల్లా పోటీలకు ఆల్టాస్ విద్యార్థులు

ప్రజాశక్తి - వేటపాలెం

జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఆల్టాస్ విద్యార్థులు ఎంపికైనట్లు ఎఒ విజయ్ కుమార్ గురువారం తెలిపారు. స్కూల్ గేమ్స్ పెడరేషన్ అఫ్ ఇండియా అద్వర్యంలో రాష్ట్ర స్థాయి వరకు జరుగుతున్నట్లు తెలిపారు. పందిళ్లపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో జరుగుతున్న ఆటల పోటీల్లో ఆల్టస్ స్కూల్ విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు గేమ్స్ కో ఆర్డినేటర్ సీతాదేవి తెలిపారు. కార్యక్రమంలో పిఈటి సురేష్, ప్రిన్సిపాల్ రామన్ రఘునాధ్, ఎజిఎం చంటిబాబు, ఎఒ పాలేటి విజయకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కొల్లూరు

సభలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నక్క ఆనందబాబు

మండలంలోని అనంతవరంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శాసన సభ్యులు నక్క ఆనందబాబు మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వంద రోజుల ప్రభుత్వ పాలన గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. సంక్షోభంలో కూడా సంక్షేమం, అభివృద్ధిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. రాష్ట్రంపై రూ.11లక్షల కోట్ల అప్పుల భారం వేసి రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి అధోగతి పాలు చేశారని అన్నారు. విజయవాడ వరదల్లో రాత్రింబవళ్లు శ్రమించి ప్రజలకు అందుబాటులో ఉండి భరోసా కల్పించారని అన్నారు. వరదలు తగ్గిన తర్వాత పది రోజుల్లో ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అందించారని అన్నారు. 20ఏళ్ల తరువాత యువత భవిష్యత్తు ఎలా ఉండాలో ఆలోచించే నాయకుడు చంద్రబాబని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ఆరోపించారు. రాష్ట్రంలో పంచాయతీలన్నీ ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించి పంచాయతీలకు స్వేచ్ఛ కల్పించి నిధులు విడుదల చేసిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌దని అన్నారు. ఇంతమంది కలిసి మంచి పనులు చేస్తుంటే రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకెళ్తుందని అన్నారు. మంది పనిచేసే నాయకులు ఉన్నారు కాబట్టి ఇది మంచి ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి ఊసా రాజేష్, తెలుగు యువత బాపట్ల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొల్లూరు నాగ శ్రీధర్, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ వై పిచ్చిరెడ్డి, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ ఐ సత్యనారాయణ, ఎపిఎం రాము, విఆర్ఒ బేగ్, డ్వాక్రా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠినచర్యలు

ప్రజాశక్తి - రేపల్లె

ఆర్డీఒ హేల షారోన్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఒ హేల షారోన్ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో తన కార్యాలయంలో సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నూతన ఇసుక విధానం అమలులోకి వచ్చేవరకు నదీ పరీవాహక ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈపాటికే ఇసుక తవ్వకాలు జరిపే రీచ్‌ల సమీపంలో పోలీసు, రెవిన్యూ అధికారులతో ప్రత్యేక బృంధాలను ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ఏడు చెక్ పోస్టులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసామని చెప్పారు. గతంలో ఇసుక తవ్వకాలు జరిపే రీచ్‌ల వద్ద అధికారులను పెట్టేవారని, ప్రస్తుతం అందుకు భిన్నంగా ఇసుక తరలించే రహదారుల కూడళ్లలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిరంతర నిఘా ఏర్పాటుతో పాటు ప్రధాన రీచ్‌ల వద్ద గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన విధానం అమల్లోకి వచ్చే వరకు టైరు బండ్ల యజమానులు తమ సొంత అవసరాలకు ఇసుక ఉచితంగా తవ్వుకొని తీసుకువెళ్లే వెసులుబాటు కల్పించామని అన్నారు. టైరు బండ్ల యజమానులు ఆయా గ్రామల పరిధిలోనే ఇసుక తరలించే అవకాశం ఉందన్నారు. అక్టోబర్ 15 తర్వాత కొల్లూరు మండలం గాజులంక, జువ్వలపాలెం గ్రామాల్లోని రెండు రీచ్‌లకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. వరదల కారణంగా ఇసుక గుట్టలు అధికంగా కుట్టుకొని రావడం చేత రానున్న రోజుల్లో మరికొన్ని రీచ్‌ల ఏర్పాటుకు అధికారులు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈపాటికే ఇసుక తరలించే వారికి పోలీసులు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, మండల అధికారులు, విఆర్ఒలు, పంచాయతీరాజ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆటలతో శారీరక, మానసిక వికాసం

ప్రజాశక్తి - వేటపాలెం

శారీరక, మానసిక వికాసానికి ఆటలు తోడ్పడతాయని డిప్యూటీ డిఈఒ అబ్బురాజు శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పందిళ్ళపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో నియోజక వర్గ స్థాయి ఆటల పోటీలు డిప్యూటీ డిఈఒ అబ్బురాజు శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఆటలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. అందుకోసం వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఒక గంట సమయం విద్యార్థినీ, విద్యార్థులకు ఆటల్లో, యోగాసనాల్లో శిక్షణ ఇవ్వాలని అన్నారు. గ్రామానికి చెందిన అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు నక్కల అర్జునరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు చదువులో ప్రతిభ కనబరిచినట్లయితే శారీరక, మానసిక వికాసంతో పాటు జీవితంలో ఉద్యోగ భద్రత ఉంటుందని చెప్పారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీలు నిర్వహించారు. అందుకు తానే సాక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్ పురుషోత్తంరావు, ఎస్‌ఎంసి ఛైర్మన్ చెరుకూరి రాంబాబు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి ఊటుకూరి శ్రీమన్నారాయణ, అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారులు పిచ్చుక నాగరాజు, జాతీయ స్థాయి అథ్లెట్ ప్రదీప్ నాయుడు, పాఠశాల హెచ్‌ఎం శేఖరారావు, అక్కాయపాలెం హెచ్‌ఎం భవనం బద్రిరెడ్డి, వేటపాలెం హెచ్‌ఎం వి ఫణి సత్యన్నారాయణ, కొత్తపేట హెచ్‌ఎం జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అండర్ 14 బాలికల విభాగంలో 100మీ, 200మీ, 400మీ, 600మీ, 4 ఇంటు 100మీ రిలే, షాట్ పుట్ పోటీలో వేటపాలెం బాలికలు ప్రథమం, డిస్కస్ త్రోలో చీరాల మండలం గెలుచుకుంది. అండర్ 17 బాలికల విభాగంలో 100మీ, 200మీ, 400మీ, 800మీ, 4ఇంటు 100మీ రిలే, 1500మీ, 3000మీ, లాంగ్ జంప్, షాట్ పుట్, జావెలిన్ త్రో లో వేటపాలెం బాలికలు ప్రథమ స్థానం పొందగా డిస్కస్ త్రోలో చీరాల విద్యార్థులు గెలిచారు. అండర్ 14 బాలుర విభాగంలో 200మీ, 400మీ, 600మీ, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో లో వేటపాలెం బాలురు ప్రథమ స్థానం, 100మీ పరుగు పందెంలో చీరాల విద్యార్థులు గెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో 100మీ, 200మీ, 400మీ, 800మీ, హైజంప్, ట్రిపుల్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో లో వేటపాలెం బాలురు ప్రథమ స్థానం, జావెలిన్ త్రో చీరాల విద్యార్థులు గెలిచారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, యోగ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. పోటీలను చీరాల, వేటపాలెం మండలాల పిఇటిలు పర్యవేక్షించారు. స్థానిక పాఠశాల హెచ్‌ఎం ఎం శేఖరరావును పిడిలు కె నాగేశ్వరరావు, టి వెంకటేశ్వర్లును, స్టాఫ్ సెక్రటరీ బి మోహనరావును సత్కరించారు.

హైజంప్ దూకుతున్న క్రీడాకారుడు

మెరుగు నాగార్జునను సత్కరిస్తున్న ఏడుకొండలు

నాగార్జునకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన మాజీ మంత్రివర్యులు డాక్టర్ మెరుగు నాగార్జునకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో వైసిపి బలోపేతానికి కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. నాగార్జున సారధ్యంలో జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు రానున్న ఎన్నికలకు సన్నద్ధం కావడం జరుగుతుందని అన్నారు. బాపట్ల పార్లమెంటు వైసిపి పరిశీలకులుగా మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను కేంద్ర కమిటీ నియమించడం పట్ల పలువురు వైసీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఎంసి వేమూరు మాజీ చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు పాల్గొన్నారు.

పుస్తకాలు పేనులు అందజేస్తున్న ఎంఈఓ దేవరాజ్

విద్యార్థులకు టీచర్స్ ఫోరం వితరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఉపాధ్యాయులు మండలంలోని ఓలేరు, పల్లిపాలెం పాఠశాలల్లోని విద్యార్థినీ, విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు ఎంఇఒ దేవరాజు చేతులమీదుగా గురువారం అందజేశారు. వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులందరి సహకారంతో నిర్వహించడం హర్షణీయం అన్నారు. అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 12 లంక గ్రామాల్లో 300మంది విద్యార్థులకు రూ.లక్ష విలువైన వస్తువులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో శివరామకృష్ణ, నరసింహారావు పాల్గొన్నారు.

తహశీల్దారును సత్కరిస్తున్న యానాదులు

తహశీల్దారు పార్వతికి సత్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

తహశీల్దారుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలపర్తి పార్వతిని మర్యాద పూర్వకంగా కలసిన యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర నాయకులు తిరువీధుల శంకర్ ప్రసాద్ గురువారం ఘనంగా సత్కరించారు. ఆయనతోపాటు టీడీపీ మహిళ నాయకురాలు దాసరి రమేష్, కోనేటి వెంకయ్య, మచ్చ సంజీవ కలిసి శాలువా, పుష్ప గుచ్చాంతో సన్మానించారు. యానాదుల సమస్యలు చర్చించారు. ఆధార్, రేషన్ కార్డ్, ఇల్లు, ఇళ్ల స్థలాలు, పాత ఇల్లు పాడైపోయి ఇల్లు కురవటం, రిక్షాలు, వలలు, టివిఎస్ లాంటి రుణాలు గతంలో టీడీపీ ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు హయాంలో ఇప్పించినట్లు గుర్తు చేశారు. మరల ప్రస్తుతం ఎంపీ కృష్ణ ప్రసాద్, ఎంఎల్ఎ కొండయ్య, కలెక్టర్ వెంకట మురళి యానాదుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. మండలంలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ప్రజాశక్తి
7
శుక్రవారం 27 సెప్టెంబర్ 2024

నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కృష్ణనగర్‌లో నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని రావిలంక, కృష్ణనగర్ గ్రామాలు ఇటీవల వచ్చిన వరదలకు ముంపు గురై నష్టపోయిన 100 కుటుంబాలకు సత్తెనపల్లికి చెందిన రాఘవేంద్ర బాలు కుటీర విద్యా సంస్థల అధ్యక్షులు మల్లేశ్వరరావు చేతుల మీదుగా గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణానది వరదల వలన నష్టపోయిన పేదలు, రైతులను ఆదుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. సత్తెనపల్లిలోని తమ విద్యా సంస్థల్లోనే విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేసి సహాయాన్ని అందించినట్లు తెలిపారు. తోకలవానిపాలెం సర్పంచ్ టి కృష్ణమోహన్ మాట్లాడుతూ చిన్న చిన్న చేతులు కలిపి రూ.లక్ష విలువ చేసే నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. ఇలాంటి విపత్తు సమయంలో స్వచ్ఛంద సంస్థలు, విద్యా సంస్థల సహాయం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుబ్బారాయుడు, ప్రిన్సిపాల్ గీతాంజలి, కొల్లూరు కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటరత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ

భూమిలో పోషకాల సమతుల్యతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - అద్దంకి

వరిలో సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించి వాటి నివారించాలని ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. మండలంలోని శంఖవరప్పాడు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి పొలాలను పరిశీలించి జింకులోపాన్ని గుర్తించి వాటి నివారణకు చిలేటేడ్ జింక్ ఎకరాకు 100 గ్రాములు వారంలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలని సూచించారు. పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి ఎస్ దీప్తి మాట్లాడుతూ కూరగాయలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8వేలు చొప్పున విత్తనాలకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. పూల తోటలకు ఎకరాకు రూ.6200 అందిస్తున్నట్లు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ అశోక్ మాట్లాడుతూ ఎర్ర జొన్నలు రాయితీపై అందిస్తామని తెలిపారు. ఎడిఎ కె ధనరాజ్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ కోటేశ్వరరావు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ భూపతి రాంబాబు పాల్గొన్నారు.

జనసేనలో చేరటం అభినందనీయం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గత అసెంబ్లీలో పనిచేసిన ప్రస్తుత మాజీ ఎంఎల్ఎలు జనసేనలో చేరటం అభినందనీయమని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి సోమరౌతు అనూరాధ, బ్రహ్మం అన్నారు. ఆమె విలేకర్లతో గురువారం మాట్లాడారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, కిలారి రోశయ్య చేరటమే కాక వీరి వెంట భారీగా తరలివచ్చిన కార్యకర్తలు జనసేన తీర్థం పుచ్చుకోవటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

ఉచితం సంగతేమో గానీ.. అసలు ఇసుకేదీ.?

- సిమెంట్ బస్తా పట్టే ఇసుక వంద రూపాయలు
- గగ్గోలు పెడుతున్న భవన నిర్మాణ యజమానులు
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - పంగులూరు

మీకు కనిపిస్తున్న సిమెంట్ బస్తాల్లో సిమెంట్ లేదు. అందులో ఉన్నది ఇసుక. ఆ సిమెంటు బస్తాల్లో పట్టే ఇసుక ఖరీదు రూ.100 అంటే మీరు నమ్ముతారా? మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. ఒక సిమెంటు బస్తాలో పట్టే ఇసుక రూ.100. ఇది ఒకటిన్నర బొచ్చెలు ఉంటుంది. ఇల్లు నిర్మించుకునే యజమానులు గత మూడు నెలలుగా ఇసుక దొరక్క, భారీ రేట్లకు ఇసుక కొంటున్నారు. ఒకపక్క ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తామని చెబుతున్నప్పటికీ ఎక్కడ ఇసుక దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ఎప్పుడు వస్తుందో తెలియక నిర్మాణాలు ఆగిపోతున్నాయి. కొంతమంది అధిక రేట్లకు తీసుకొచ్చి భవనాల పనులు చేసుకుంటున్నారు. ఈ లెక్కన ఒక్క ట్రక్కు ఇసుక కావాలంటే రూ.12వేల నుండి రూ.14వేల వరకు అవుతుంది. ఇది భవన నిర్మాణ యజమానులకు భారం కావడంతో పనులు వాయిదాలు వేసుకునే పరిస్థితి ఏర్పడింది. కొందరు అధిక ధరలైనా తప్పడం లేదని చెబుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి పాలకులు ఉచిత ఇసుక ఇస్తామని చెప్పటంతో ఉచిత ఇసుక కోసం ఎదురుచూస్తున్నారు. అంతకు ముందు వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ట్రక్కు ఇసుక రూ.5వేలకు వచ్చేదని, ఇప్పుడు ఉచిత ఇసుక కాదు కదా డబ్బులు పెట్టి కొందా మన్నా ఇసుక దొరకడం లేదని చెబుతున్నారు. గుండ్లకమ్మ, సముద్రతీర ప్రాంతమైన కడవకుదురు ఇసుక రావడం లేదు. కృష్ణానది నుండి ఇసుక తెప్పించుకోవాలంటే టన్ను రూ.2వేలు ధర పలుకుతుంది. ఒక ట్రక్కుకు నాలుగు టన్నులు పడుతుంది. బాడుగతో కలుపుకొని ట్రక్కు ఇసుక రూ.12వేలు పలుకుతుందని చెబుతున్నారు. ఈ రేట్లతో తాము ఇల్లు ఎలా నిర్మించుకోవాలని యజమానులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని అమలు చేసి వెంటనే ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

చేనేత మగ్గం గుంటల్లోకి వర్షపు నీళ్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మగ్గం గుంటల్లోకి చేరిన వర్షపు నీరు

భారీ వర్షాలకు చేనేత కార్మికుల మగ్గం గుంటలోకి వర్షపు నీళ్లు చేరాయి. దీంతో కార్మికులకు పనులు నిలిచిపోయాయి. భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం గ్రామాల్లో చేనేత కార్మికులు చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వర్షాకాలంలో ఆయా గ్రామాల్లో కురస్తున్న భారీ వర్షాలకు మగ్గం గుంటల్లోకి వర్షపు నీరు చేరి పని చేయటానికి వీలు లేక రోజుల తరబడి ఉపాధి కోల్పోతున్నామని చేనేత కార్మికులు వాపోతున్నారు. నెల రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి మగ్గం గుంటలు పూర్తిగా నీటితో నిండిపోవడమే కాక మగ్గంపై ఉన్న పడుగులూ పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల నుండి వాతావరణం అనుకూలించడంతో ఉండటంతో దాని నుండి తేరుకుంటున్న సమయంలో మరోసారి రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మరోసారి మగ్గం గుంటలు వర్షపు ఊట నీటితో నిండిపోయి ఉపాధికి గండి పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చేనేత కార్మికులు మరింత అవస్థలు ఎదుర్కోనాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

పౌష్టికాహారం తీసుకుంటే మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని గన్నవరం క్లస్టర్లోని కటారుపాలెంలో పౌష్టిక ఆహారం మాసోత్సవాల్లో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు పౌష్టక ఆహారం తీసుకున్నట్లయితే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో గన్నవరం క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని పర్చూరు ఐసిడీస్ సిడిపిఒ గాదె సుబధ్ర తెలిపారు. స్థానిక గడ్డం బజార్ అంగన్‌వాడి కేంద్రంలో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసాత్సవాల్లో ఆమె మాట్లాడారు. పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనత ఏర్పడుతుందని అన్నారు. దానిని అధిగమించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇంటిలో అందుబాటులో ఉండే వస్తువులతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పౌష్టిక పదార్థాలు లబ్యమయ్యే ఆహార పదార్థాలను తయారు చేసుకోవచ్చని వివరించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని అందరికి అందించాలని సూచించారు. అనంతరం అవగాహన కల్పించేందుకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ తలమాల శిరీష, భారతి, బాచిన కుసుమ, జ్యోతి, విజయ, ఫాతిమా, ఆశా కార్యకర్తలు కల్యాణి, నాగరాణి, సునంద పాల్గొన్నారు.

మార్టూరులో ర్యాలి నిర్వహిస్తున్న అంగనవాడీ కార్యకర్తలు

యద్దనపూడిలో ర్యాలి నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ప్రధాని ఆవాస్ యోజన నూరుశాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

'మన ఇళ్ళు – మన గౌరవం' 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుపై మండలంలోని అధికారులు, సచివాలయం సిబ్బంది, పంచాయతి కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం ఎంపిడిఒ కార్యాలంలో నిర్వహించారు. ఈనెల 28న అన్ని సచివాలయాల్లో అవగహన సదస్సు నిర్వహించాలని సూచించారు. ప్రధాన మంత్రి అవాస యోజన మంజూరైన ప్రతి పేరు మర్చి –2025 కల్లా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఒక వేల పూర్తి చేయలేకపోతే ఆ పేర్లు రద్దు కాబడతాయని చెప్పారు. ప్రతి లబ్దిదారునికి అవగాహన కల్పించి నూరుశాతం పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఈఒపీఆర్డి ఎ రామకృష్ణ, హౌసింగ్ ఎఈ జి రాజ్ కుమార్, ఎపిఒ బుల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్

కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య ప్రతినిధులు

29న ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - చీరాల

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ డాక్టర్ చుండూరి నాగేశ్వరావు, లలిత దంపతులు సహకారంతో ఈ నెల 29న ఆదివారం స్థానిక ముంతావారి సెంటర్లోని ఎన్‌విఎస్ అండ్ ఎస్‌జెఆర్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీరాం సురేష్ తెలిపారు. స్థానిక ఎంజిసి మార్కెట్ వద్ద వైద్య శిబిరానికి సంబందించిన కరపత్రాలు గురువారం ఆవిష్కరించారు. గత మూడేళ్లుగా డాక్టర్ నాగేశ్వరావు, లలిత దంపతుల సహకారంతో ఉచిత కంటి వైద్యశిభిరం ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలతో పాటు శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేస్తామని చెప్పారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం జరుగుతుందని కార్యక్రమంలో శ్రీరాం వేణుగోపాల్, వేముల చంద్రశేఖర్, కోటా శ్రీమన్నారాయణ, మంచికంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు బహూకరణ

చిత్రపటాల బహూకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మక్కెనవారిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను ఆ పాఠశాల చైర్మన్ మక్కెన అంజయ్య, వైస్ చైర్మన్ బిల్లూరి కొండమ్మ పాఠశాల హెచ్‌ఎంకు గురువారం అందజేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, మదర్ థెరీసా, జ్యోతిరావు పూలే, జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ తదితర జాతీయ నేతల చిత్రపటాలను పాఠశాలకు బహుకరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి మెంబర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి - కొల్లూరు

పంట నష్ట పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమ కాని రైతులు బ్యాంకుల్లో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఆర్ వెంకటేశ్వరరావు సూచించారు. ఈనెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంట నష్టపరిహారం విడుదల చేసినప్పటికీ కొంతమంది రైతులకు వివిధ కారణాలవల్ల నగదు ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. ఆధార్ బ్యాంకు కాతాకు అనుసంధానం కాకపోవడం, ఆధార్, బయోమెట్రిక్ ఫెయిల్ కావడం వంటి కారణాలతో జమ కాకపోవచ్చని తెలిపారు. ఆధార్ సీడింగ్ చేసుకుని ఖాతాను తాజాపర్చుకోవాలని సూచించారు.

కోడిపందేల నిర్వాహకుల అరెస్టు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని నాగాండ్లలో ఆరు బయట నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. దాడిలో రూ.690 నగదు, ఆరు ద్విచక్ర వాహనాలు, 11మంది నిర్వాహకులను, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు మండలంలో ఎలాంటి అసాంఘిక చర్యలు జరిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాగుంట పార్వతమ్మకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు
- ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాగుంట పార్వతమ్మ (ఫైల్)

కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి సతీమణి, మాజీ పార్లమెంట్ సభ్యులు మాగుంట పార్వతమ్మకు కుటుంబ సభ్యులు, మాగుంట అభిమానులు కన్నీళ్లతో వీడ్కోలు పలికారు. రాష్ట్ర ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు మాగుంట పార్వతమ్మకు ప్రభుత్వ లాంఛనాలతో గురువారం నెల్లూరులో అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అంత్యక్రియలకు హాజరయ్యారు. తొలుత నెల్లూరు సరస్వతి నగర్‌లోని మాగుంట సుబ్బరామ రెడ్డి నివాసంలో మాగుంట పార్వతమ్మ భౌతిక కాయానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, మాజీ శాసనసభ్యులు కరణం బలరామకృష్ణ మూర్తి, శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ సిండికేట్ మెంబర్ కె.అనీలా కుమారి,జిల్లాకు చెందిన వివిధ పార్టీల నేతలు మాగుంట పార్వతమ్మకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నెల్లూరు దర్గామిట్ట సరస్వతి నగర్‌లోని మాగుంట సుబ్బరామరెడ్డి నివాసం నుంచి మాగుంట పార్వతమ్మ అంతిమ యాత్ర ప్రారంభమైంది. నెల్లూరు నగరంలో పార్టీలకు అతీతంగా మాగుంట పార్వతమ్మ అంతిమ యాత్రలో అశేష ప్రజానీకం పాల్గొన్నారు. మాగుంట పార్వతమ్మ అమర్ రహే నినాదాలతో నెల్లూరు నగర వీధులు మారుమోగాయి. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవిద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధ్యక్షతన అనంతరం నెల్లూరు దహన శాఖలో మాగుంట పార్వతమ్మకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి, కుటుంబ సభ్యులతో పాటు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి గారు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి , టిడిపి యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఏరిక్షన్ బాబు పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డి, పలు పార్టీలకు చెందిన నాయకులు, మాగుంట అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపి పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా సురేష్

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా గురువారం నియమించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నియామకం చేపట్టారు. ఈ బాధ్యతలు అప్పగించినందుకు జగన్‌కు డాక్టర్ ఆదిమూలపు సురేష్ కతజ్ఞతలు తెలిపారు.

వర్షాలకు మళ్లీ మునిగిన పొలాలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఆవేదనలో అన్నదాతలు

ఐలవరంలో మునిగిన పంటలు

ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన వరి పంట కురుస్తున్న అధిక వర్షాలకు నిరంతరం మునిగిపోతూనే ఉన్నాయి. గత నెలాఖరులో కురిసిన భారీ వర్షానికి వేలాది ఎకరాలు ముంపునకు గురై.. ఇప్పటివరకు నీరు బయటకు వెళ్లక అనేక ప్రాంతాల్లో నీరు నిలబడి సాగు చేసిన వరి పంట పూర్తిగా దెబ్బతిని ఖాళీ చేలయ్యాయి. మరికొంతమంది భట్టిప్రోలు, ఐలవరం, అద్దేపల్లి బాడవ పొలాలలో రైతులు దెబ్బతిన్న పంట పొలాలకు మరోమారు దూరప్రాంతాల నుండి నారును అధికధరలకు కొనుగోలు చేసి.. సాగు చేపట్టారు. ఈ సాగుచేసిన పొలాలు కూడా మంగళవారం, బుధవారం రాత్రి వేళల్లో కురిసిన అతి భారీవర్షాలకు మరో మారు మునిగిపోయి చెరువుల మారి సముద్రాన్ని తలపిస్తున్నాయి. గత నెలలో కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇటీవల పదివేల రూపాయలు చొప్పున నష్టపరిహారాన్ని అందించినప్పటికీ రెండో విడత సాగు చేసిన రైతులు ఒక్కో ఎకరాకు నారు కొనుగోలుతో 15 నుండి 20 వేల రూపాయల వరకు ఖర్చు చేశామని, ఆ ఖర్చు కాస్తా వర్షార్పణం అయ్యిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే రైతులకు వర్షాలు రూపంలో ప్రకతి తీవ్ర నష్టాన్ని కలిగించిందని వాపోతున్నారు. గత వర్షానికి మండలంలో సుమారు 5 వేల ఎకరాల వరకు దెబ్బతినగా దానిలో అధిక శాతం కౌలు రైతులే ఉండటం గమనార్హం. ఈ దెబ్బతన్న పంటలో రైతులు మరో మారు దాదాపు వెయ్యి ఎకరాల వరకు వరినట్లను సాగు చేసినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ప్రస్తుతం కురిసిన వర్షాలకు పూర్తిగా మునిగిపోయాయి. వీరిలో కొంతమంది రెండవ విడతగా వరి నారుమళ్లు కూడా పోసుకుని సాగుకు సిద్ధపడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. సుమారు ఎకరాకు 30 నుండి 40 వేల వరకు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. ఇదే కౌలురైతులయితే కౌలుతో కూడా కలిపి 60 నుండి 70 వేల వరకు ఖర్చు చేసి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భట్టిప్రోలు మండలం, ఐలవరం గ్రామానికి చెందిన ఆకురాతి వెంకట సుబ్బారావు అనే కౌలు రైతు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షానికి పంటలు మొత్తం పూర్తిగా దెబ్బతిని చెరువులా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- వచ్చే ఏడాది నుంచి ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు
- ట్రిబుల్ ఐటీ నీట్‌కు కోచింగ్
- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

పాకల తీరంలో పర్యటిస్తున్న కలెక్టర్, మంత్రి

ప్రజాశక్తి-శింగరాయకొండ

విద్యకే ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు గురుకుల సోషల్ వెల్ఫేర్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియాతో కలిసి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి శింగరాయకొండలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఐఐటీ– నీట్ శిక్షణ, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచే శింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఐఐటి, నీట్ కోచింగ్ ప్రారంభిస్తున్నామన్నారు వచ్చే ఏడాది విద్యా సంవత్సరం నుంచి శింగరాయకొండ గురుకులాల్లో డిగ్రీ కళాశాల కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో మొట్టమొదటిగా శింగరాయకొండలో గురుకుల డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అనంతరం గురుకుల పాఠశాలలోని రాష్ట్ర జిల్లా స్థాయి అధికారులతో పాటు అన్ని శాఖల అధికారులతో మంత్రి డాక్టర్ స్వామి కార్యదర్శి ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ తమిమ్ అన్సారియా సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు ఈ సమస్యలో పాల్గొని గురుకుల పాఠశాల అభివద్ధిపై ప్రణాళికను రూపొందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామితో పాటు సెక్రెటరీ ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ తమిమ్ అన్సరియా భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డి.జయ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీనాయక్, ఏపీఈడబ్ల్యూ ఐడిసి ఇ ఇ.భాస్కర్‌బాబు, డిఇ జగన్, ప్రిన్సిపాల్ కె.రమాదేవి, తహశీల్దార్ టి.రవి, ఇన్‌చార్జి ఎండిఓ మూర్తి పాల్గొన్నారు.

వైజాగ్ బీచ్ తరహాలో ప్రణాళిక

శింగరాయకొండ మండలంలో పాకల బీచ్‌ని అన్ని విధాలుగా అభివద్ధి చేస్తామని మంత్రి స్వామి తెలిపారు. గురువారం నాడు గురుకుల సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ ప్రసన్న వెంకటేష్, కలెక్టర్ తమిమ్ అన్సారియాల తో కలిసి పాకల బీచ్‌ని సందర్శించారు. అక్కడ బీచ్‌కి సంబంధించి పరిశీలించారు. వైజాగ్ తరహాలో పాకల బీచ్‌ని అభివద్ధి చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. కొత్తపట్నం బీచ్ నుంచి రామాయపట్నం బీచ్ వరకు పాకల కలుపుకొని తారు రోడ్డు నిర్మాణానికి కషి చేస్తామని వివరించారు. వీరి వెంట సర్పంచ్ సైకం చంద్రశేఖర్, తహశీల్దార్ టి. రవి, ఎండిఓ మూర్తి తదితరులు ఉన్నారు.

తిరుమలలో జగన్ డిక్లరేషన్ తీసుకోవాల్సిందే..

ప్రజాశక్తి-శింగరాయకొండ

మంత్రి స్వామి

మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఏపీజే అబ్దుల్‌కలాం, సోనియాగాంధీ కంటే జగన్మోహన్‌రెడ్డి గొప్పవాడు కాదని, వాళ్లే తిరుమలకు వెళితే డిక్లరేషన్ తీసుకొని వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారని, జగన్మోహన్‌రెడ్డి ఖచ్చితంగా డిక్లరేషన్ తీసుకుని తిరుమల వెంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని రాష్ట్ర మంత్రి స్వామి అన్నారు. గురువారం నాడు శింగరాయకొండకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి గతంలో ముఖ్యమంత్రి పదవి అధికారాన్ని అడ్డం పెట్టుకొని తిరుమలకి వెళ్లి రావటం జరిగిందన్నారు. ఆయన భక్తితో ఏనాడూ తిరుమలకు వెళ్లలేదని, లడ్డు విషయంలో జరుగుతున్న వివాదంలో ఇప్పుడు తిరుమలకి వెళుతున్నాడని చెప్పారు. ఖచ్చితంగా శ్రీ వెంకటేశ్వరస్వామి దేవుడు మీద నమ్మకం ఉంది అనే విషయంలో తిరుమలలో డిక్లరేషన్ తీసుకొని దర్శనానికి పోవాలన్నారు. అక్కడికి వచ్చిన అప్పటి రాష్ట్రపతిగా ఉన్న ఏపీజే అబ్దుల్ కలాం, కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ సైతం తిరుపతికి వెళ్లి డిక్లరేషన్ తీసుకొనే దర్శనం చేసుకున్నారన్నారు. వాళ్లిద్దరి కంటే ఈ జగన్ పెద్ద గొప్ప ఏమీ కాదన్నారు.

పెండింగ్ కేసుల విచారణ వేగవంతం

- రాత్రి సమయాలలో మరింత సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలి
- ఎస్పీ తుషార్‌డూడి

మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ నేర సమీక్షాసమావేశం నిర్వహించారు. గంజాయి, ఎస్సీ ఎస్టీ, మిస్సింగ్ కేసులు, మహిళా సంబంధిత నేరాలు ఫోక్సో కేసులు, దొంగతనాలు, తీవ్రమైన నేరాలు, రౌడీ షీటర్లు పాత నేరస్తులపై నిఘా, పెండింగ్ లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ లు, రోడ్డు ప్రమాదాలు, సీసీ కెమెరాల ఏర్పాటు సంబంధిత అంశాల గురించి సమీక్షించారు. వివరాలను స్క్రీన్ పై ప్రదర్శిస్తూ సంబంధిత అధికారుల నుండి కేసు వివరాలను, దర్యాప్తు చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకొని కేసు ఫైల్స్ ను పరిశీలించారు. నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యల గురించి, వీక్లీ ప్లాన్ అఫ్ యాక్షన్ లో భాగంగా జిల్లా పోలీస్ అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. గతవారం జరిగిన లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించిన బాపట్ల పట్టణ సీఐ జానీ అహ్మద్ కి, నేరాలు ఛేదించడంలో విశేష కషి చేసిన ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా విక్రయాలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గంజాయి సంబంధిత కేసులలో గతంలో అరెస్ట్ కాబడిన ముద్దాయిలపై నిఘా ఉంచాలన్నారు. పగలు రాత్రివేళ గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. పోలీసు సిబ్బంది సమర్థవంతంగా గస్తీ నిర్వహించి దొంగతనాలు, ఇతరు నేరాలను కట్టడి చేయాలన్నారు. అనుమానితులు తారసపడితే వారిని విచారించాలన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనప్పుడు వాటిని వేగవంతంగా దర్యాప్తు చేసి తగిన సాక్షాదారాలతో ముద్దాయిలను అరెస్టు చేసి సంబంధిత కోర్టులో అబియోగ పత్రం దాఖలు చేయాలని డిఎస్పీ లకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోవడానికి అవకాశం ఉన్న ప్రదేశాలలో పోలీసుల గస్తీ ఎక్కువగా నిర్వహించాలన్నారు. తద్వారా నేరాలను తగ్గించవచ్చునన్నారు. వార్డ్, గ్రామ సచివాలయ మహిళా పోలీసుల ద్వారా వారి పరిధిలో నివాసం ఉండే ఒంటరి మహిళలు, ఒంటరిగా నివాసముండే వృద్ధుల యొక్క వివరాలను సేకరించుకొని ఆ ప్రాంతాలలో ఎక్కువ పెట్రోలింగ్ నిర్వహించుకుంటూ తరచు వారి గృహాలను సందర్శిస్తూ ఉండాలన్నారు. నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె డిఎస్పి టి.మురళీకష్ణ, బాపట్ల డిఎస్పి జి.రామాంజనేయులు, సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, ఏఆర్ డిఎస్పి ఎస్.చంద్రమోహన్, ఎస్.బి సిఐ జి.నారాయణ పాల్గొన్నారు.